క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులకు మెమోలు జారీ

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి సచివాలయం పరిధిలో పని చేస్తున్న 8 మంది సచివాలయం ఉద్యోగులకు మెమోలు జారీ చేసినట్టు ఎంపీడీవో ఎస్.రఘునాధాచారి శుక్రవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావడం లేదని, అర్ధాంతరంగా విధుల నుంచి వెళ్లిపోతున్నారన్న విషయాన్ని గ్రామస్తులు మీడియా దృష్టికి తెచ్చారు. దీంతో ఎంపీడీవో రఘునాధాచారి స్పందించి సచివాలయం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మెమోలు జారీ చేసి వారి నుంచి వివరణ కోరినట్టు వెల్లడించారు.

కౌలు రైతుల వివరాల నమోదు


మాట్లాడుతున్న ఏవో కన్నబాబు

వంగర: గ్రామాల్లో కౌలు రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామంలో రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు చేస్తున్న భూముల వివరాలను భూ యజమాని నుంచి 1-బీ తీసుకోవాలని, కౌలు రైతు ఆధార్ కార్డు అందజేయాలని తెలిపారు. రైతులతో సమానంగా అవకాశాలుంటాయన్నారు. గ్రామ రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సక్రమంగా నిర్వహించాలి


కేఎంవలస అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు తనిఖీ చేస్తున్న సీడీపీవో

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలు, ఆయాలు సక్రమంగా నిర్వహించాలని రాజాం సీడీపీవో డాక్టర్ కనకదుర్గ సూచించారు. మండలంలో బూరాడ, ఉంగరాడమెట్ట, వండానపేట, కేఎంవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలకు వస్తున్న సరుకుల వివరాలు, లబ్ధిదారులకు అందజేస్తున్న పోషకాహార సామాగ్రిల రికార్డుల పరిశీలించారు. చిన్నారుల అభివృద్ధిపై ఆరా తీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు


దేవుదళలో కషాయం తయారీపై అవగాహన

రేగిడి: వ్యవసాయ రంగంలో రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని దేవుదళ గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. చీడపీడల నివారణకు పురుగు మందులు వినియోగించకుండా దశకంత కషాయం వినియోగం, తయారీ చేసే విధానంపై వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి ప్రవీణ, యూనిట్ ఇంచార్జ్ గౌరీశ్వరరావు ఐసీఆర్‌పీలు శ్రీదేవి, శ్రీలత, గోవిందమ్మ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మండాకురిటిలో పారిశుధ్య లోపం


మండాకురిటిలో చెత్తతో నిండిన మురుగు కాలువ

సంతకవిటి: మండలంలోని మండాకురిటిలో అపారిశుధ్యం నెలకొంది. గ్రామంలోని కొన్ని వీధుల్లో కాలువలు చెత్తా చెదారంతో నిండి పూడికలతో దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే మురుగునీరు రోడ్లు పైనుంచి ప్రవహిస్తుందని, ఇలా అయితే రోగాల బారిన పడతామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ఉన్నప్పటికీ చెత్తను రోడ్డు పక్కనే వేస్తుండంతో మండాకురిటి-శేషాద్రిపురం రహదారిలో ప్రయాణించే వారు ముక్కు మూసుకుంటున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కురుస్తున్న చిరు జల్లులు

బాడంగి: తుఫాన్ ప్రభావంతో మండలంలో అడపాదడపా చిరుజల్లులు కురుస్తున్నాయి. వాతావరణం కూడా మబ్బుపట్టి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. మెట్టు భూములలో చెరకు విత్తులు ఎడ్లు నాగలితో దుక్కిచేసి నాటుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వేసవి తాపం దాదాపు తగ్గిందని ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.

గతమెంతో ఘన కీర్తి


రాజాం: నాడు-నేడుతో రూపు మార్చుకున్న బొద్దాం జెడ్పీ హైస్కూల్

ఈ ఫొటోలోని పాఠశాల రాజాం మండలం బొద్దాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. 2019-20 విద్యా సంవత్సరం నాటికి కేవలం 156 మంది విద్యార్థులు మాత్రమే చదువుతుండేవారు. రెండో విడతలో నాడు-నేడు ద్వారా ఈ పాఠశాలలో రూ.69 లక్షల నిధులు మంజూరయ్యాయి. గతేడాది వరకూ 26 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశారు. ఫలితంగా 2023-24 విద్యాసంవత్సరంలో ఇక్కడ విద్యార్థుల సంఖ్య 212కు పెరిగింది.

బాగా అభివృద్ధి చేశారు



మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో ప్రైవేట్ పాఠశాలలకు పంపేంచే వాళ్లం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన మార్పు చూసి, ప్రభుత్వ పాఠశాలలకే పంపిస్తున్నాం. బాగా చదివే వారు. గతంలో అమ్మ ఒడి, పుస్తకాలు పంపిణీ, యూనీఫాం పంపిణీ ఉండేది. ఇప్పుడు ఇంకేమీ లేవు. భవిష్యత్ ఎలా ఉంటుందో తెలియడం లేదు.

– ముగడ నాగచంద్రిక, వండానపేట, రేగిడి మండలం

రాజాం: రాజాం నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగింది. 2019కి ముందు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 10 వరకూ చదివిన వారి సంఖ్య 15 వేల నుంచి 16 వేల మధ్య ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 21 వేలకు చేరుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఆ సంఖ్య మళ్లీ 18 వేలకు పడిపోయింది. ఈ విద్యా సంవత్సరంలో ఇంకా తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు బడులు సుందరంగా దర్శనమిచ్చేవి. శిథిలావస్థలో ఉన్న భవనాలకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించి, అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతూ వచ్చేది. గత ప్రభుత్వం ఈ పాఠశాల వ్యవస్థను గాడిలో పెట్టింది. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చింది. విద్యార్థులకు మానసిక సామర్థ్యాన్ని పెంచే ఆరోగ్యకర వాతావరణాన్ని పాఠశాలల్లో ఏర్పాటుచేసింది. ఒక్కో పాఠశాలలో కనీసం రూ.40 లక్షలు మొదలుకుని రూ.2 కోట్ల వరకూ నిధులు పెట్టి తాగునీరు, మరుగుదొడ్లు, కొత్త బెంచీలు, డిజిటల్ బోర్డులు, బైజ్యూస్ కంటెంట్ పాఠ్యాంశాలు ఏర్పాటు చేసింది. ఉచితంగా జగనన్న కిట్లు, ఆంగ్ల, తెలుగు అనువాద మిర్రర్ పాఠ్యపుస్తకాలు, ప్రతీ ఏడాది రెండు జతల యూనీఫాం దుస్తులు అందజేసింది. వీటన్నింటికి తోడు అమ్మ ఒడి విద్యార్థుల తల్లిదండ్రులకు బాగా కలసివచ్చేది.


అర్ధాంతర నిర్మాణాలతో బొద్దాం జెడ్పీ హైస్కూల్ భవనాలు

ఈ ఫొటోలోని దృశ్యం పాఠశాల అర్ధాంతర భవన నిర్మాణాలు. ఇవి కూడా రాజాం మండలం బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలవే. కూటమి వచ్చిన తరువాత ఇక్కడ నాడు-నేడు పనులు నిలిచిపోయాయి. విద్యార్థుల హాజరు శాతం తగ్గుముఖం పట్టే పరిస్థితి ఇప్పుడు వచ్చింది.


రూ. 48 లక్షల నాడు - నేడు పనులతో సుందరంగా వంగర మండలం శివ్వాం ఎంపీయూపీ స్కూల్

ఈ ఫొటోలోని పాఠశాల వంగర మండలంలో శివ్వాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల. నాడు-నేడుతో ఇక్కడ పాఠశాల అభివృద్ధి చేయడంతో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ పాఠశాలలో చేరారు. ఇక్కడ బోధన బాగుండడంతో విశాలమైన తరగతి గదులు, డిజిటల్ బోధన, అత్యాధునిక టెస్ట్ బుక్స్, విద్యార్థులకు ఉచితంగా జగనన్న కిట్లు, యూనీఫాం దుస్తులు అందుతున్నాయి. వీటికి తోడు జగనన్న గోరుముద్ద పథకం వీరందరినీ ఆకర్షించింది. ఈ పాఠశాలకు రూ.64 లక్షల నిధులు మంజూరీ కాగా, రూ.48 లక్షల నిధులతో నాడు-నేడు పనులు నిర్వహించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాల పర్యవేక్షణ పూర్తిగా కనుమరుగైంది.

బొబ్బిలి: నాడు - నేడు పథకం కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బొబ్బిలి పట్టణం, మండలంలోని పాఠశాలల్లో భవనాల నిర్మాణాల కోసం మొదటి విడతగా 1137 లక్షల రూపాయిలను మంజూరు చేయగా రెండో విడతగా 973 లక్షల రూపాయిలను కేటాయించి మంజూరు చేసింది. అయినా కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి అర్ధాంతరంగా నిలిచిపోయిన నిర్మాణాలు అలాగే ఉన్నాయి. రానున్న పాఠశాలల పునః ప్రారంభానికైనా అదనపు తరగతుల నిర్మాణాలు పూర్తి చేస్తారన్న నమ్మకం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు గదుల్లో పిల్లలకు పాఠాలు చెప్పేందుకు పూనుకుంటున్న యంత్రాంగం కొత్త నిర్మాణాలను వినియోగంలోకి తెచ్చేందుకు ఎందుకు ప్రయత్నం చేయడం లేదన్న వాదన వినిపిస్తోంది.

బాడంగిలో...


నిధుల లేమితో నిలిచిపోయిన కోడూరు హైస్కూల్ అదనపు భవనాలు

మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాభివృద్ధి కోసం పాడుబడిపోయిన పాతశాలల స్థానంలో నాడు - నేడు పేరుతో నూతన అదనపు తరగతుల భవనాలు, పాత భవనాల మరమ్మతులు, టాయిలెట్స్, మినరల్ వాటర్ ప్లాంట్లు, విద్యార్థులకు బెంచీలు, ఫ్యాన్లు, ప్యానల్ బోర్డులు వంటి సౌకర్యాలు సమకూరాయి. నేడు అవరిస్ కనిపించడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫేజ్1, 2 రెండు విడతలుగా హైస్కూళ్లతో పాటు ప్రాథమిక పాఠశాలలు బాగుపడ్డాయి. అయితే రెండో విడతగా నిధులు చాలక నిలిచి పోయిన రేజేరు-2, కోడూరు-3 అదనపు భవనాలు శ్లాబ్‌లు వేసి నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు వాటి నిర్మాణాల పూర్తికి నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. బాడంగి ఎస్సీ కాలనీ, జీకేఆర్‌పురం, చిన వాడాడ, తెంటువలస, డొంకినవలస రైల్వే స్టేషన్‌లలోని పాఠశాలలు అభివృద్ధికి నోచుకోలేదు.

రామభద్రపురంలో..

మండలంలోని 57 పాఠశాలలుండగా వీటి అభివృద్ధి కోసం మొదటి విడతలో రూ.4.33 కోట్ల అంచనా నిధులతో 25 పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ.3.88 కోట్ల నిధులు ఖర్చు చేసి మిగతా నిధులు ప్రభుత్వానికి జమ చేశారు. రెండో విడతలో రూ.7.44 కోట్లతో 21 పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు కాగా అందులో 11 పాఠశాలల పనులు పూర్తయ్యాయి. అప్పట్లోనే వీటి పనుల కోసం రూ.5.28 కోట్ల నిధుల బిల్లులు మంజూరు చేశారు. మరో పది పాఠశాలలు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన పాఠశాలలు ఎక్కడివక్కడే ఉన్నాయి తప్ప కూటమి ప్రభుత్వం పనులపై దృష్టి సారించనే లేదు.

ఏడాదిగా... నిర్లక్ష్యం!


పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో మూత పడ్డ ఆర్వో ప్లాంటు

ఈ చిత్రం చూశారా? గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సుమారు 350 పైచిలుకు విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్ ఇది. అప్పట్లో ఇది చక్కగా పని చేస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలోనూ, ఇతర సమయాల్లో దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగ పడేది. ఇప్పుడు ప్రభుత్వం మారిన తరువాత దీనిని మూలన పడేశారు. మరమ్మతులకు నిధులు కేటాయించ లేదు. మళ్లీ పాఠశాలలు తెరిస్తే విద్యార్థులు తమ ఇళ్ల నుంచి నీరు తెచ్చుకోవాల్సిందే!


నిరుపయోగంగా ఉన్న పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల భవనాలు

ఈ చిత్రం చూశారా? గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసిన రూ.42లక్షల నిధులతో నిర్మించిన భవనం. అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఈ భవనాన్ని కేవలం రంగులు వేయలేదు. కనీసం విద్యార్థులకు అవసరమయిన తరగతి గదులను ప్రారంభించకుండా వదిలేసింది కూటమి ప్రభుత్వం. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తెర్లాంలో..


నిలిచిపోయిన లోచర్ల హైస్కూల్ భవన నిర్మాణాలు

పాఠశాలల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వదిలేసింది. దీనికి ఉదాహరణగా మండలంలోని లోచర్ల హైస్కూల్‌కు 5 అదనపు తరగతి గదుల భవనాల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు తరగతులు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

4న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

- ఇచ్చిన హామీలు నెరవేర్చని సీఎం చంద్రబాబు
- ప్రజలను మోసగించడంపై జూన్ 4న నిరసన
- నియోజకవర్గకేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ
- పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొనాలని పిలుపు


రాజాంలో వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఇంచార్జ్ డాక్టర్ రాజేష్ తదితరులు.

రాజాం: అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంపై కూటమి ప్రభుత్వాన్ని నిరసిస్తూ జూన్ నెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. రాజాంలోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో రాజాం పట్టణం, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ కన్వీనర్లు, నియోజకవర్గ కన్వీనర్లతో కలసి సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని మండలాల నేతలతో కలసి జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలు, సభలపై సలహాలు తీసుకున్నారు. అనంతరం ఆయన పార్టీ శ్రేణులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తప్పుడు హామీలు ఇచ్చి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. ప్రజలను వెన్నుపోటు పొడిచి ఏడాది కావస్తున్న సందర్భంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని, ప్రతీ మండలం నుంచి బాధిత ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

గట్టిగా నిలదీయాలి

అధికారంలోకి వచ్చిన ఏడాదికే ప్రజలతో అధికార పార్టీ ఛీ అనిపించుకుంటుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శాసనసభ టీడీపీ కార్యకర్తల సభలా జరుగుతుందని, శాసన మండలిలో ప్రశ్నించే సభ్యులను తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎటువంటి హామీలు అమలు చేయకుండా, రాష్ట్రంలో సంక్షేమం లేకుండా ఏడాది కాలంలో రూ.1.40 లక్షల కోట్లు అప్పులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, రేషన్ వాహనాలు తీసేసారని, తల్లికి వందనం లేదని, మద్యం ధరలు పెరిగిపోయి ఏరుల్లా ప్రవహిస్తుందని, రైతు భరోసా లేదని, ఆసరా అటకెక్కిందని, సచివాలయ సేవలు కనుమరుగౌతున్నాయని ధ్వజమెత్తారు.

ప్రతీ ఒక్కరి బాధ్యత

పార్టీ రాజాం ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 10 గంటలకే వెన్నుపోటు దినం ర్యాలీ పాలకొండరోడ్డులో సన్‌రైజ్ ఆస్పత్రి వద్ద ప్రారంభం కానుందని వెల్లడించారు. అధికార పార్టీ మోసాన్ని నిరసిస్తూ జరిగే ఈ ర్యాలీలో ప్రజలు పాల్గొనాలని, కార్యకర్తలు ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పాలకొండ రోడ్డు నుంచి అంబేడ్కర్ జంక్షన్ మీదుగా మాధవబజార్ ఎదురుగా వైఎస్సార్ విగ్రహం వద్దకు, అక్కడి నుంచి తిరిగి అంబేడ్కర్ కూడలికి ర్యాలీ వస్తుందన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తామని, ప్రతీ ఒక్క కార్యకర్త, అభిమాని ఈ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాల నాయుడులు, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల అధ్యక్షులు వావిలపల్లి జగన్మోహనరావు, కరణం సుదర్శనరావు, గురుగుబెల్లి స్వామినాయుడులు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రేగిడి వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పార్టీ నియోజకవర్గ అనుబంధ విభాగాల కన్వీనర్లు పాలవలస గోపి, బొనెల ప్రసాద్, కరణం శ్రీనివాసరావు, గంగారావుమాష్టరు, ఆసపు సూర్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం రేపు


శంబంగి

బొబ్బిలి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జూన్ 1న నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి పట్టణంతో పాటు బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న నిర్వహించబోయే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నట్టు చెప్పారు. కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కోఆర్డినేటర్లు హాజరయి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఐదు ఉన్నత పాఠశాలలకు కొత్త హెచ్‌ఎంలు

రామభద్రపురం: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలలు ఉండగా ఐదు ఉన్నత పాఠశాలలకు కొత్తగా హెచ్‌ఎంలు బదిలీపై వచ్చినట్టు అధికారిక సమాచారం. రామభద్రపురం ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన కె.కామేశ్వరరావుకు బదిలీ అవ్వగా ఆయన స్థానంలో వంగపండు గోపారావు, ఆరికతోట ఉన్నత పాఠశాలకు జీసీ హెచ్‌వీ శర్మ స్థానంలో జి.కృష్ణవేణి, పాతరేగ ఉన్నత పాఠశాలకు నాయుడు వెంకటరావు స్థానంలో చప్ప రమణ, రొంపల్లి ఉన్నత పాఠశాలకు ఎం.వేణుగోపాల్ స్థానంలో కె.రామారావు హెచ్‌ఎంలుగా బదిలీపై వచ్చారు. కొట్టక్కి ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు పని చేసిన రావాడ భాస్కరరావు పదవీ విరమణ చేయనుండగా ఆ స్థానంలో ఎ. శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు.

సేవలతోనే రోటరీకి గుర్తింపు


రంగారావును సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బొబ్బిలి: సమాజంలోని ప్రజలకు అవసరమయిన సేవలు చేయడంలోనే రోటరీ క్లబ్‌కు అంతర్జాతీయంగా పేరొచ్చిందని, ఇందుకు నాయకులు, సభ్యులు మరింత కృషి చేయాలని రోటరీ క్లబ్ మెంబర్ షిప్ అధ్యక్షుడు ఏవీ రంగారావు అన్నారు. స్థానిక రోటరీ కార్యాలయంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సింద్రీ శ్రీనివాసన్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవలు, నడవడిక, జీవన విధానాలను వివరించారు. రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు మాట్లాడుతూ వసతిగృహాల్లో చదువుతున్న 250 మంది విద్యార్థులకు పరుపులు అందించే ఏర్పాట్లు రోటరీ ద్వారా చేస్తున్నామన్నారు. అనంతరం మెంబర్ షిప్ అధ్యక్షుడ్ని సభ్యులంతా సత్కరించారు. కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, శ్రీహరి, శివకాంత్, ఫౌండేషన్ చైర్ గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి

రాజాం సిటీ: కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా జరుగుతున్న దోపిడీని అధికారులు అడ్డుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్ కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల పరిసరాల్లో ఎటువంటి పుస్తకాలు విక్రయించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ కార్పొరేట్ పాఠశాలలో ఆ నిబంధనను తుంగలో తొక్కుతున్నాయని అన్నారు. శుక్రవారం రాజాంలోని పలు కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ రోజురోజుకు పెరిగిపోతుందని విమర్శించారు. ఫీజుల రూపంలో రూ.40 నుంచి రూ.50వేల వరకు ఒక ఏడాదికి వసూలు చేస్తుండడమే కాకుండా మరో పక్క పుస్తకాలు, యాప్‌లు, యూనిఫాంల రూపంలో మరో రూ.15వేల వరకు వసూలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హమని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి పి.రమేష్, నాని, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి: మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ పాలక వర్గ సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. చైర్మన్ రాంబార్కి శరత్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

శిక్షణ సద్వినియోగం కావాలి

రాజాం సిటీ: మహిళలకు అందిస్తున్న కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించండి

బొబ్బిలి: కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలోని రోడ్ల గుంతల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని వెంటనే తోడాలని, వాటికి మార్గాలు చూపించి నీరు నిలవ కుండా చేయాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. కాలేజ్ రోడ్డులో వర్షపు నీటి గుంతలను సందర్శించారు. నీరు నిలువ లేకుండా చూడాలని ఆదేశించారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

రాజాం: పట్టణంలోని మెంతిపేట వద్ద జవహార్ బాలభవన్‌లో నెల రోజులు క్రితం ప్రారంభించిన వేసవి శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. నెల రోజుల పాటు ఎనిమిది రకాల కళలపై ఇక్కడ శిక్షణ ఉచితంగా ఇచ్చారు. రాజాంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ తదితర ప్రాంతాల నుంచి రాజాం వచ్చిన విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని నృత్యం, సంగీతం, క్రాఫ్ట్ వంటి కళల్లో శిక్షణ పొందారు. ధ్రువీకరణ పత్రాలను రాజాంకు చెందిన రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ చేతుల మీదుగా బాలభవన్ రాజాం సెక్టార్ డైరెక్టర్ సుంకరి రమేష్ అందజేశారు.